Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 312 పేజీలు 8 వెల : 5 మంగళవారం 12 మే 2026

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో
మరో సంచలనం
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ఉత్తేజిత తెలుగు దినపత్రికకు మరియు UV9 కేబుల్ Tv చానెల్ కు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ల నందు పనిచేయుటకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు నియోకవర్గాల వారిగా ఆర్.సి.ఇన్‌చార్జిలు మండలాల వారిగా విలేకరులు కావలెను

ఉత్తేజిత దినపత్రిక UV9

Contact : 94401 40418, 63038 17489



02

## సికింద్రాబాద్ యువకుడి హత్యకేసు

**10మంది నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు**

**యువతితో ప్రేమాయణమే కారణమన్న డిసిపి**




# పారిశ్రామిక ప్రగతిలో సిఐఐది కీలక భూమిక

**పశ్చిమాసియా యుద్ధంతో సంక్షోభ పరిస్థితులు**
**ప్రధాని మోడీ మిషన్ దేశానికి అవసరం**
**అందరం కూడా దానిని అసనుసరిస్తే మంచిది**
**సవాళ్లను అధిగమించే సమయం ఇదే**
**సిఐఐ సదస్సులో ఎపి సిఎం చంద్రబాబు**




న్యూఢిల్లీ: పారిశ్రామిక పురోగతిలో సీఐఐది కీలక పాత్ర అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం పారిశ్రామికంగా వృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. వినూత్న ఆలోచనలతో లక్ష్యాలు చేరుకోవచ్చని వివరించారు. 1990 నాటి ఆర్థిక సంస్కరణల ఫలితాలను ఇప్పుడు చూస్తున్నామని చెప్పుకొచ్చారు. సోమవారం ఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ సుస్థిరమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలని మోదీ సూచించారని అన్నారు. సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కొన్ని అంశాలతో ప్రధాని మోదీ జాతీయ మిషన్‌ను ప్రకటించారు. ప్రధాని మిషన్‌ను అందరూ ముందుకు తీసుకెళ్లాలి. ఇది ప్రధాని టాస్క్ మాత్రమే కాదు, మనందరిది. సంక్షోభం నుంచి వచ్చిన సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలి. సరైన సమయంలో సరైన నాయకుడిగా మోదీ ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. ప్రపంచంపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉందని వెల్లడించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత్‌పై పడకుండా కేంద్ర ప్రభుత్వం చూసిందని తెలిపారు. ప్రస్తుతం ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు.. క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోందని వివరించారు. వికసిత్ భారత్ దిశగా ముందుకెళు_న్నామని చెప్పుకొచ్చారు. భారత ఆర్థికవృద్ధి వేగంగా కదులుతోందని అన్నారు. పెట్టుబడులకు స్వర్గధామం ఆంధ్రప్రదేశ్ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. భారత పరిశ్రమల ప్రోత్సాహానికి సీఐఐ సరైన వేదిక అని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక పురోగతిలో సీఐఐ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. ప్రభుత్వాలు ఎకో సిస్టమ్‌ను మాత్రమే సృష్టిస్తాయని, ఇన్నోవేటర్లు, పారిశ్రామికవేత్తలు దీర్ఘకాల ఆర్థిక పరిపుష్టికి దోహదం చేస్తారని తెలిపారు. తనకు జాతీయ, రాష్ట్ర అజెండాలున్నాయని, వాటిని పారిశ్రామికవేత్తలు ప్రోత్సహిస్తారన్న నమ్మకం ఉందన్నారు. 1990 సంస్కరణల మాదిరిగా భారత్ మరో మైలురాయి ముంగిట ఉంది. ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు, క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోంది.

ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలు తదుపరి గ్లోబల్ ఎకనమిక్ ఆర్డర్‌ను నిర్ధరిస్తాయి. ఆర్థిక సంస్కరణల వల్ల మనందరికీ సృజనాత్మకతతో వైవిధ్యంగా ఆలోచించే అవకాశం వచ్చింది.

## ప్రధాని మా ఇంటికి రావడం గొప్ప విశేషం

**మరచిపోలేని అనుభూతిని పొందాం**

**ఎక్స్ వేదికగా చంద్రబాబు, లోకేశ్ భావోద్వేగం**



అమరావతి: హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తమ నివాసానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రావడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ భావోద్వేగంగా స్పందించారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు చేస్తూ ప్రధాని పర్యటనను ప్రత్యేకమైన సందర్భంగా వారు అభివర్ణించారు. ప్రధాని మోదీకి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ మేరకు సీఎం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తమ కుటుంబం ఎప్పటికీ మర్చిపోలేని, ఒక మధుర జ్ఞాపకంగా నిలిచిపోయే సాయంత్రం ఇదని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ రోజు తమ నివాసంలో ప్రధాని మోదీకి ఆతిథ్యం ఇవ్వడం తమకు లభించిన గొప్ప గౌరవం, సంతోషమని చెప్పుకొచ్చారు. ఆప్యాయత, అనురాగంతో ప్రధాని తమతో గడిపిన ఈ సందర్భం తమ అందరికీ ఎంతో ప్రత్యేకమని వ్యాఖ్యానించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.



## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

**సభ్యులుగా శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ**

**మరో సహభ్యురాలుగా చాకలి ఐలమ్మ మనవరాలు**

హైదరాబాద్, మే 11 : తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు ప్రభుత్వం కొత్త నియామకాలు చేపట్టింది. మహిళా హక్కుల పరిరక్షణ, మహిళా సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం కీలకమైన తెలంగాణ మహిళా కమిషన్‌కు

-మిగతా 2 లో..

## రేవంత్ డైరెక్షన్‌లోనే కూల్చివేతలు

**గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత**

**కూల్చిన ఆలయం వద్ద పరిశీలించిన హరీష్ రావు**



వరంగల్, మే 11 : లంకెబిందెల కోసమే పురాతమైన ఆలయాలను కూల్చివేస్తున్నారని, సీఎం రేవంత్ రెడ్డికి కూల్చడం తప్ప కట్టడం రాదని శాసనసభ విపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. వరంగల్ జిల్లా ఖానపురం మండలం అశోక్ నగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిన 800 ఏండ్ల చారిత్రక కాకతీయ కట్టడం శివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గుప్త నిధుల కోసం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. స్కూల్ నిర్మాణం కోసం అయితే అర్ధరాత్రి తవ్వకాలు ఎందుకు చేపట్టారని ప్రశ్నించారు. గర్భగుడి కింద 24 అడుగుల లోతు తవ్వాకాలు చేపట్టారని పురావస్తు శాఖ తేల్చింది. ఆలయాల కూల్చివేతపై ఇప్పటి

-మిగతా 2 లో..



## రాష్ట్రానికి వచ్చి సుద్దులు చెప్పిన ప్రధాని

**అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మాటలెందుకు**

**ప్రధాని పర్యటనపై మంత్రి పొన్నం వ్యాఖ్యలు**

హైదరాబాద్, మే 11 :ప్రధానమంత్రి మోదీ తెలంగాణకు వచ్చి అభివృద్ధికి నిధులేమీ ఇవ్వకుండా పెట్రోల్, బంగారం, వంట నూనె వాడవద్దని చెప్పి వెళ్లారని

-మిగతా 2 లో..

## హ్యామ్ రోడ్లపై సీఎంతో చర్చలు

**మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి**

నాణ్యమైన మౌలిక వసతుల అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పకొచ్చారు. మొత్తం 6,092 కిలోమీటర్ల పొడవుతో 34 ప్యాకేజీలుగా హ్యామ్ పనులు కొనసాగుతున్నాయని అన్నారు.



హైదరాబాద్,మే 11 :హ్యామ్ తుది అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం లేదా బుధవారం కలిసి చర్చిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హ్యామ్ ప్రాజెక్ట్ పురోగతిపై సోమవారం సచివాలయంలో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ

-మిగతా 2 లో..

## రాష్ట్రానికి వచ్చి సుద్దులు చెప్పిన ప్రధాని

(మొదటిపేజీ తరువాయి)

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ప్రధాని వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని, కానీ అభివృద్ధికి నిధులేమీ ప్రకటించకుండా పెట్రోల్, డీజిల్ వాడవద్దు.. బంగారం కొనవద్దు.. వంట నూనె వాడవద్దు అని చెప్పడం ప్రధాని హోదాకు తగదని అన్నారు. సోమవారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. వేలాది కార్లతో రోడ్ షో చేసిన మోదీ ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయాందోళనలు కలిగించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేయాలని భాజపా నేతలు గతంలో డిమాండ్ చేశారని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా కేంద్రం ఎందుకు చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన 12 ఏళ్లలో కేంద్రం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఆర్ఆర్ఆర్ నిధులు, మెట్రో నిధులు, రేడియల్ రోడ్లు, గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు సహా రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి అంశాలపై తెలంగాణలోని 8 మంది భాజపా ఎంపీలు.. ఒక్క వినతిపత్రమైనా ఇచ్చారా? అని మంత్రి నిలదీశారు. బీసీ హక్కులు, దేవాలయాల అభివృద్ధి, క్యూర్ ఏరియా అభివృద్ధి వంటి కీలక అంశాలపై తెలంగాణ భాజపా నేతలు మాట్లాడటం లేదని మంత్రి విమర్శించారు. రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణలో కులగణన నిర్వహించామని, జనగణనలో బీసీ కులాల వివరాలు చేర్చాలని కేంద్రాన్ని కోరినా మోదీ సర్కార్ స్పందించడం లేదని మంత్రి పొన్నం ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ నెరవేర్చలేదని విమర్శించారు. బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో కేంద్ర మంత్రి హోదా ఉపయోగించి విచారణ అడ్డుకోవద్దన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలని, దోషులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

## మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులతో మంత్రి చర్చించారు. హ్యామ్ ప్రాజెక్ట్ టెండర్ పక్రియపై అధికారులను ఆరా తీశారు. దేశవ్యాప్తంగా ఎన్‌హెచ్ఏఐ, ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న హ్యామ్ మోడల్ వివరాలు మంత్రికి వివరించారు అధికారులు. బిటుమెన్ ధర మెట్రిక్ టన్నుకు రూ.44 వేల నుంచి రూ.89 వేలకు పెరిగిందని తెలిపారు. బిటుమెన్ ధరల్లో దాదాపు వందశాతం పెరుగుదల నమోదైందని అధికారులు వివరించారు. జీఎస్టీ అదనపు భారం, ఇతర మెయింటెనెన్స్, పశ్చిమాసియ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ధరలు పెరగడానికి కూడా ఓ కారణమని అధికారులు పేర్కొన్నారు. గుజరాత్‌లో 66శాతం, మహారాష్ట్రలో 47శాతం ధరలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ధరలు తక్కువగా ఉన్నాయని వెల్లడించారు. రూ.5 లక్షల కోట్లతో దేశంలో 374కు పైగా హ్యామ్ ప్రాజెక్టులు కొనసాగు తున్నాయని మంత్రి తెలిపారు.

## ఆరోగ్యశాఖలో 1919 నర్సింగ్ ఆఫీసర్ల నియామకం

(మొదటిపేజీ తరువాయి)

పంపిణీ కార్యక్రమం ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో మంగలశారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. భారీసంఖ్యలో అభ్యర్థులు హాజరుకానుండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, కూర్చునే సదుపాయం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 1919 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తోంది. వీరితో పాటు లేబర్ డిపార్ట్‌మెంట్‌లో మరో 257 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. ఈ నియామక పక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు పారదర్శకంగా నియామక పత్రాలు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలో నర్సింగ్ రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతను తగ్గించేందుకు ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయి. కొత్తగా నియమితులయ్యే నర్సింగ్ ఆఫీసర్లు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అందించనున్నారు. ఈ నియామకాలతో ప్రభుత్వ వైద్యసేవలు మరింత బలోపేతం అవుతాయని ఆరోగ్యశాఖ అధికారులు భావిస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలను విస్తరించేందుకు కొత్తగా నియమితులయ్యే నర్సింగ్ ఆఫీసర్లు ఉపయోగపడనున్నారని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషంగా మారింది. కరోనా కాలంలో నర్సులు అందించిన సేవలను ప్రభుత్వం గుర్తు చేసుకుంటూ, ఆరోగ్యరంగంలో వారి పాత్ర ఎంతో గొప్పదని పేర్కొంది. ప్రజారోగ్య పరిరక్షణలో నర్సులు ముందుండి సేవలందిస్తున్నారని, వారి సేవలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

## సికింద్రాబాద్ యువకుడి హత్యకేసు

**హైదరాబాద్, మే11 :** సికింద్రాబాద్ చిలకలగూడ ప్రాంతంలో రెండు రోజుల క్రితం యావన్ అనే యువకుడు హత్యకు సంబంధించిన కేసులో పురోగతి సాధించారు. యావన్ తన స్నేహితులతో కలిసి చిలకలగూడలో ఓ ఇంట్లో క్రికెట్ మ్యాచ్ చూస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి కత్తులతో దాడి చేశారు. తల, గొంతు, శరీరభాగాల్లో తీవ్రమైన కత్తిపోట్లు కావడంతో యావన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తాజాగా యావన్ హత్యకు సంబంధించిన వివరాలను సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితా మూర్తి వెల్లడించారు. ఈనెల 7వ తేదీన చిలకలగూడ పీఎస్ ప్రాంతంలో జరిగిన యావన్ హత్య కేసులో 10 మంది నిందితులను అరెస్ట్ చేశామని అన్నారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాం. కేసు విచారణ కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేశాం. ఈ కేసులో సాయి కిరణ్ మొదటి నిందితుడు. అతడే యావన్ హత్యకు ప్లాన్ చేశాడు. అరెస్టైన వారిలో యువతి తండ్రి నరసింహ యాదవ్, బాబాయ్‌లు మల్లేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్ ఉన్నారు. వీరితో పాటు అమ్మాయి బ్రదర్ పరమేష్ , అలానే ఓ మైనర్ కూడా ఉన్నాడు' అని డీసీపీ రక్షితా మూర్తి తెలిపారు. పక్కా ప్లాన్ చేసి.. యావన్‌ను హత్య చేశారు. హత్యకు నాలుగు రోజుల ముందు నుంచే యావన్‌ను చంపేందుకుప్లాన్ చేశారు. మేడిబావి ప్రాంతానికి వస్తే యావన్‌ను హత్య చేయడానికి ప్లాన్ చేసుకున్నారు. 7వ తేదీన యావన్ తన స్నేహితుడైన సుబ్బు ఇంటికి వచ్చాడు. అదే సమయంలో గ్యాంగ్ వచ్చి యావన్‌తో గొడవ పడ్డారు. ఆ సమయంలో ఒకరు కత్తితో యావన్‌ను పొడిచారు. అనంతరం మిగిలిన నిందితులు కూడా యావన్‌ను కత్తితో పొడిచారు. తీవ్రంగా గాయపడి యావన్‌ను స్నేహితులు గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారు' అని డీసీపీ వెల్లడించారు. యావన్‌కు ఒక యువతితో స్కూల్ డేస్ నుంచి పరిచయం ఉంది. గత రెండేళ్లుగా ఇద్దరు ప్రేమలో ఉన్నారు. వారి ప్రేమ విషయం యువతి తల్లిదండ్రులకు నచ్చలేదు. దీంతో అతన్ని హెచ్చరించారు. అయినా యావన్ అలానే అమ్మాయితో ప్రేమ కొనసాగించాడు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు ద్విచక్ర వాహనం మొబైల్ ఫోన్లు సీజ్ చేశాం. నిందితులకు డ్రగ్స్ టెస్టులు నిర్వహించాం. అందులో రాహుల్, శివలకు గంజాయి పాజిటివ్ వచ్చింది' అని డీసీపీ రక్షితా మూర్తి తెలిపారు.

# రాష్ట్ర ప్రయోజనాల కోసమే నా పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

సరెండర్‌లు, మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్, బండి భగీరథ్ కేసు వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హెచ్ఐసీసీలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను ప్రస్తావించిన అభివృద్ధి అంశాలను ప్రధాని మోదీ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర సహకారం అవసరమని, అదే విషయాన్ని మోదీ దృష్టికి తాను తీసుకెళ్లానని చెప్పుకొచ్చారు. 'నేను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రిని... కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే' అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగు తున్నామని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని మోదీ సమావేశం కావడం ప్రైవేట్ కార్యక్రమమని చెప్పుకొచ్చారు. అలాగే తమతో కలిసి రావాలన్న ప్రధాని మోదీ పిలుపును స్వాగతిస్తున్నామని తెలిపారు. ప్రధాని అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నానని, ఆయన పిలుపులో రాజకీయాలకు తావులేదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమంలో కేంద్రంతో కలిసి వెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. వికసిత్ భారత్‌లాగే విజన్ 2047 సాధనకు, 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అందుకునేందుకు కేంద్రంతో కలిసి నడుస్తామన్నారు. కేంద్రం, రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ముందుకెళ్లాలని తెలిపారు. తమ పార్టీలు, ఐడియాలజీ వేరైనా.. అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామన్నారు. ఎన్నోసార్లు కలిసినా.. కేంద్రం నుంచి ఆశించిన మద్దతు రాలేదని, 2 గంటలు సమయమిస్తే తమ ప్రణాళికలు ప్రధానికి వివరిస్తామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేందప్రభుత్వం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మెట్రో, సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్ వంటి కొన్ని ప్రాజెక్టులు

ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్‌లు, డిఫెన్స్ ల్యాండ్స్, మూసీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధులు, నేషనల్ హైవేలకు అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని తాను ప్రధాని మోదీని కోరగా ఆయన అంగీకరించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీని 'బ్రిటిష్ జనతా పార్టీ'గా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. విభజించి పాలించడం ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. ముస్లింలు, క్రిస్టియన్లు, మావోయిస్టులు కూడా ఈ దేశ ప్రజలేనని, అందరికీ సమాన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఖతం చేయడం వాళ్ల విధానమని విమర్శించారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఒప్పించి జనజీవనంలో కలపడం కాంగ్రెస్ విధానమని వ్యాఖ్యానించారు. విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కేంద్రానికి స్పష్టమైన విధానం లేదన్నారు. జెమిని సర్కస్ లా బీజేపీ ఎన్నికల విధానం ఉంటుందని ఎద్దేవా చేశారు. అనుభవరాహిత్యం, అహంకారం వల్లనే దేశాన్నిసంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పశ్చిమబెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. కేరళంలో 3 సీట్లు, తమిళనాడులో ఒక సీటు మాత్రమే బీజేపీ గెలుచుకుందని ప్రస్తావించారు. ఏ రాష్ట్రంలో గెలవాలంటే అక్కడ ఎస్ఐఆర్‌ను ప్రయోగిస్తున్నారని ఫైర్ అయ్యారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రాలేదని.. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి ఏమిటని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రెండు సీట్లతో ప్రారంభమైందని..అక్కడికే వస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌ను మోదీ విమర్శిస్తే తనను విమర్శించినట్లేనని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు ఆశించిన మేరకు సహకారం లేదని చెప్పారు. బీజేపీకి



ప్రజాస్వామ్యంపైన నమ్మకం లేదని మండిపడ్డారు. తమిళనాడులో అతిపెద్ద పార్టీకి ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ ఆహ్వానించకుండా నిర్లక్ష్యం ఎందుకు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ జపం చేయకుండా బీజేపీ బతకదని విమర్శించారు. తెలంగాణలో 818 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారని, దేశంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బుల్లెట్ కాదు బ్యాలెట్ అని కాంగ్రెస్ ఎప్పటి నుంచో చెబుతోందని, చివరకు మావోయిస్టులు కూడా అదే మార్గంలోకి వచ్చారని అన్నారు. మావోయిస్టుల లొంగుబాటుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. గణపతి వంటి నేతలు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. అవసరమైతే వైద్య సహాయం, ఆర్థిక సాయం కూడా అందిస్తామని తెలిపారు. దేశం కోసం కాంగ్రెస్ ప్రాణాలు ఇచ్చిందని ఉద్ఘాటించారు. రాజీవ్ గాంధీని చంపిన వాళ్లకు కూడా సోనియా గాంధీ క్షమాభిక్ష పెట్టారని ప్రస్తావించారు. ప్రధాని మోదీ మాట్లాడిన కొన్ని మాటలు దురదృష్టకరమని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణం చేయొద్దని ప్రజలకు చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. విదేశాంగ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రతిపక్షాల సూచనలు తీసుకోవాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కేంద్రానికి సూచించారు. మోదీ అనుభవరాహిత్యం, అహంకారం వల్ల దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌ను దేనికి సంబంధం లేకుండా అమలు చేయడానికి అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయొచ్చని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన 543 లోక్‌సభ సీట్లను దామాషా ప్రకారం చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. 50 శాతం పెంపు అనే దానికి కూడా ఎలాంటి ఫార్ములా లేదని చెప్పుకొచ్చారు. సీట్ల పెంపకంపైనే అందరికీ అభ్యంతరాలు ఉన్నాయని అన్నారు. జమిలి ఎన్నికలు 2029లో జరిగే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన కేసు విషయంపై కూడా సీఎం స్పందించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మే 8వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదైందని, ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్ల కారణంగా విచారణ ఆలస్యమైందని వివరించారు. ఇప్పుడు దర్యాప్తు వేగవంతం చేశామని, సిట్ ఏర్పాటు చేశామని.. సీనియర్ మహిళా అధికారిని విచారణాధికారిగా నియమించినట్లు చెప్పారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని.. ఎవరినీ ఇప్పటివరకు వదలిపెట్టలేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కూడా సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేశారు. గతంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఫిర్యాదు చేసిన ఆయనే తర్వాత ప్రభాకర్ రావును నీతిమంతుడని చెప్పారని గుర్తుచేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దగ్గర ఆధారాలు ఉంటే పోలీస్ కమిషనర్‌కు ఇవ్వొచ్చని.. మైక్‌ల ముందు స్టేట్‌మెంట్లు ఇవ్వడం వల్ల విచారణ జరగదన్నారు. కేటీఆర్ బామ్మర్ది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ తీసుకుని దొరికినా తాము వదల్లేదని తెలిపారు. ఖాళీగా ఉన్నామని కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోలీసుల డ్యూటీ చేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. గడీలు బద్దలు కొడతానని గతంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారని ప్రస్తావించారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయినప్పటికీ తడిసిన ధాన్యాన్ని కూడా తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని చెప్పారు. పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృత చర్చలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు వివరణ ఇచ్చే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. యూరియా కేంద్రం ఇవ్వాలని.. రాష్ట్ర ప్రభుత్వం పంచాలని తెలిపారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు అంశంపై ఇప్పటికే మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మహారాష్ట్ర సీఎం స్పందించేలా చూడాలని ప్రధాని మోదీకి కూడా లేఖ పంపినట్లు చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రధాని పెద్దరికం వహిస్తే మంచిదని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ద్వారా కూడా చర్చలు జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

(మొదటిపేజీ తరువాయి)

ఛైర్ పర్సన్‌గా మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని నియమించింది. అలాగే కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం పలువురు ప్రముఖ మహిళలకు అవకాశం కల్పించింది. ఈ నియామకాల్లో తెలంగాణ ఉద్యమం, సామాజిక సేవ, మహిళా హక్కుల ఉద్యమాల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతచారి తల్లి కాసోజు శంకరమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీకాంతచారి త్యాగం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ నియామకంతో తెలంగాణ ఉద్యమ కుటుంబాలకు ప్రభుత్వం గౌరవం ఇచ్చినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేతను కూడా కమిషన్ సభ్యురాలిగా కాంగ్రెస్ సర్కార్ నియమించింది.

చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆమె కుటుంబానికి ఈ నియామకంతో ప్రాధాన్యం సంతరించు కుంది. మహిళా కమిషన్ సభ్యులుగా శశికళ యాదవ్ రెడ్డి, సదాలక్ష్మి, రాధాభాయి, ఉజ్మా షకీరాలను కూడా ప్రభుత్వం నియమించింది. వివిధ సామాజిక వర్గాల కు ప్రాతినిధ్యం కల్పించేలా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తోందని, మహిళల సమస్యల పరిష్కారంలో కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు.

## రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు కృషి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పరిశ్రమలశాఖ అధికారులతో, ప్రాజెక్ట్ కన్‌స్టలెంట్లతో సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలశాఖపై ఆయన సమీక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి వివిధ రాష్ట్రాల పారిశ్రామికవేత్తలు ఆస్తకి చూపుతున్నారని, ఆ దిశలో పరిశ్రమలశాఖ అధికార యంత్రాంగం సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని, తగు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకొని పారిశ్రామికవేత్తలతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎం.ఒ.యు.లతోపాటు పెట్టుబడి దారులకు అవసరమైన ఇతర మౌలిక వసతులను సమకూర్చాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలతోపాటు ఆయా రంగాలలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను కూడా పెట్టుబడుదారులకు తెలియపరిచి రాష్ట్రాభివృద్ధికి తోడ్పాలని సిఎస్ తెలిపారు. భారీ పెట్టుబడులతో పాటు స్థానిక యువతకు అధిక స్థాయిలో ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఫార్మా రంగం, చేనేత ఉత్పత్తులు, టెక్స్ టైల్ పార్కులు, ఐటీ పరిశ్రమలు, డేటా సెంటర్లు, డ్రైపోర్టులు సంబంధిత రంగాల్లో పారిశ్రామికవేత్తలు భారీగా పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నారని, తెలంగాణ రైజింగ్ -2047 విజన్ కు వారు ఆకర్షితులవుతున్నందున అధికార యంత్రాంగం కూడా తగు కార్యాచరణ ప్రణాళికతో వారిని ప్రోత్సహించాలన్నారు. అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ తదితర ఐటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారని అధికారులు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం, డెయిరీ ఉత్పత్తుల రంగంలో కూడా పెట్టు బడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాలలో పెట్టుబడులతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని అధికారులు అన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## 17 రాష్ట్రాలు, 5 యూటీల్లో త్వరలో మూడో దశ 'సర్' : ఈసీ

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు తెలిపారు. మిగిలిన 40 కోట్ల ఓటర్లకు సంబంధించి 17 రాష్ట్రాలు, ఐదు కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడోదశ సవరణ ప్రక్రియ చేపట్టనున్నారు. వాస్తవానికి ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ఫిబ్రవరి 19నే లేఖ రాసింది. ఏప్రిల్‌లో ఈ ప్రక్రియ ఉంటుందని, అందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించింది. అయితే, వివిధ కారణాల రీత్యా షెడ్యూల్‌లో ఆటంకం ఏర్పడింది. బిహార్‌లో ఓటర్ల సమగ్ర సవరణ చేపట్టడంపై ఆయా పార్టీలు సుప్రీంకోర్టు తలుపుతట్టడం, పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ సైతం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం వంటి కారణాలతో ఈ ప్రక్రియ ఆలస్యం అయ్యింది.

## 13న పాలిటెక్నిక్ ప్రవేశ రీక్ష

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ,ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, ఉద్యానవన , వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి ఉదయం 11 గంటల నుంఇ మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 56,494 మంది విద్యార్థులు, 49,945 మంది విద్యార్థినులు పరీక్షలకు దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 293 పరీక్ష కేంద్రాను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ కానీ, ఏ ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులను అనుమతించబోమని వివరించారు.

## గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత

(మొదటిపేజీ తరువాయి)

వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుంత్వం రాగానే దేవాదాయ శాఖ భూమి ప్రభుత్వ భూమిగా మారిందన్నారు. గుప్త నిధుల వేటలో ప్రభుత్వ పెద్దలు ఉన్నారన్నారు. పేదల ఇళ్లతో పాటు గుళ్లను కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో వరంగల్ జిల్లాలో ఎన్నో ఆలయాలను పునరద్ధరించామని గుర్తు చేశారు. రామప్ప ఆలయానికి బీఆర్ఎస్ యునెస్కో గుర్తింపు తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ధ్వంసం చేసిన శివాలయాన్ని పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సూదర్శన్ రెడ్డి, దాస్యం వినయ భాస్కర్, అరూరి రమేష్, శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

# శ్రీశైలం నీటి ముంపు బాధితులకు న్యాయం చేయుటలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం

**దీక్ష శిబిరానికి సందర్శించి సంఘీభావం తెలిపిన**

**సిపిఐ ఎంఎల్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు**

**వాల్మీకి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర నాయుడు**



**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మే 11 :**

శ్రీశైలం నీటి ముంపు బాధితులకు న్యాయం చేయుటలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని సి.పి.ఐ (ఎం.ఎల్) పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి. వెంకటేశ్వర్లు అన్నారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో సోమవారం శ్రీశైలం నీటిముంపు దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి ఆయన సంఘీభావం తెలిపారు. తెలుగుదేశం పార్టీకూటమిలోని ముగ్గురు ముఖ్య నాయకులు ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు , మంత్రివర్యులు లోకేష్ పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు పవన్ కళ్యాణ్ నందికోట్కూరు పట్టణంలో బహిరంగ సభలలో లక్షలాది మంది ప్రజల మధ్య శ్రీశైలం నీటి ముంపు భాదితులకు ఇచ్చిన +శీ 98 హామి అమలు చేసి శ్రీశైలం నీటి ముంపు భాదితుల దీక్షలు 47వ రోజుకు చేరిన ఇంత వరకు హమి అమలు చెయ్యకపోవడం అన్యాయమని దీక్షా శిభిరం నుండి "పటేల్ సెంటర్ వరకు శ్రీశైలం నీటి ముంపు సభ్యులు మరియు సి.పి.ఐ (ఎం.ఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిక్కిలి.వెంకటేశ్వర్లు మరియు వాల్మీకి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల.గౌరీ ఈశ్వర్ నాయుడు శ్రీశైలం నీటి ముంపు బాధితులకు మద్దతుగా ర్యాలిలో పాల్గొన్నారు. అనంతరం శ్రీశైలం నీటి ముంపు సభ్యుడు జయన్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి ని కలిసి సమస్య విన్నవించినా కూడా సమస్య పరిస్కరంచలేదని ఆవేదన వ్యక్తపరిచారు. శ్రీశైలం నీటి ముంపు సభ్యుల త్యాగాల వల్లే నేడు రాష్ట్ర అభివృద్ధి 8 లక్షల హెక్టార్ల భూమికి సాగునీరు, కోటి మందికి తాగునీరు 1470 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో రాష్ట్రం అభివృద్ధిలో వుందని ఈ శ్రీశైలం ముంపు సభ్యులు మాత్రం తమకు ఇచ్చిన హామీ నెరవేరక చెట్టు కొకరు పుట్ట కొకరు బతుకుతున్నారని ఇప్పటికే 32 మంది ఆత్మహత్యలు చేసుకొని చనిపోయారని వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని వారి పిల్లల చదువులు మధ్యలో ఆగిపోయి దిక్కుతోచని స్థితిలో వున్నారని శ్రీశైలం నీటి ముంపు భాదితుడు జయన్న ఆవేధన వ్యక్తం చేశారు. ఇక్కడ కే.సి కెనాల్ కింద ఒక పంటకు కూడా సాగునీరు ఇవ్వడం లేదని కుప్పం వరకు సాగునీరు అందుతుందని ఇది శ్రీశైలం నీటి ముంపు భాదితుల కన్నీటి ప్రవాహం కాదా? అని ప్రశ్నించారు. శ్రీశైలం నీటి ముంపు భాదితులకు ఇచ్చిన జీవో 98 అమలు చేసి ఉద్యోగాలు ఇవ్వాలని లేకపోతే ఆమరణ నిరాహార దీక్షలకు పూనుకుంటామని శ్రీశైలం నీటి ముంపు బాధితులు హెచ్చరించారు. అనంతరం సి.పి.ఐ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిక్కిలి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీశైలం నీటి ముంపు భాదితులను ఆధుకోవడంలో ప్రభుత్వం గోరంగా వైపల్యం చెందిందని ఇది దుర్మారమైన పాలనా అని దుయ్యబట్టారు.ముగ్గురు నాయకులు హామి ఇచ్చి నెరవేర్చక శ్రీశైలం నీటి ముంపు భాదితులను రోడ్డున పడేసిందని వారికి ఇచ్చిన జీవో 98 హామి అమలు అయ్యే వరకు వారికి తోడుగా వుంటామని అవసరమైతే ప్రజా ప్రతినిధులను అడ్డుకుంటామని హెచ్చరించారు.ఇక త్వరలో 674 కుటుంబాలకు ఉద్యోగ ఆర్డర్ ఇవ్వాలని లేకపోతే రాష్ట్ర ర్యాప్త ఉద్యమాలకు సిద్దమవుతామని పిక్కిలి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ దీక్షలో వాల్మీకి సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల.గౌరి ఈశ్వర్ నాయుడు సి.పి.ఐ(ఎం.ఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిక్కిలి.వెంకటేశ్వర్లు, శ్రీశైలం నీటి ముంపు భాదితులు జయన్న,నాగేంద్రుడు,రాజారావు, మౌలాలి,సాలమ్మ రాణి,శ్యామలమ్మ,యశోదమ్మ,పటాన్ సాహేబ్ ఖాన్ నారాయణ రవి అయ్య,సి.పి.ఐ(ఎం.ఎల్) లిబ రేషన్ జిల్లా నాయకులు టి.నరసింహులు,వేల్పుల.ఏసన్న,మేకల చంద్రశేఖర్,లింగాల.శ్రీనివాసులు,ఎం నరేష్,వడ్డే శ్రీరాములు ప్రగతి శీల సంఘం జిల్లా మహిళ నాయకురాలు ఎస్.బి.బి,బి.లక్ష్మీదేవి, ముత్తుజాబి,నవ్యసాని, నూర్జహాన్,పి.మణికుమారి, షాహినా,శిరీష,తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయడం జరిగింది.

# పెంచిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలి :- ఏఐటీయూసి

**గోనెగండ్ల ఉత్తేజిత న్యూస్ :-**




(రిపోర్టర్ రుద్ర )కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నీయోజకవర్గం మండల కేంద్రమైన గోనెగండ్లలో (ఏఐటీయూసీ) ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ గోనెగండ్ల మండల సమితి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు మరియు అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకుగాను నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు తిమ్మాగురుడు, దాసరి గణేష్ సిపిఐ సిపిఎం నాయకులు మద్దిలేటి మాట్లాడుతూ సామాన్య ప్రజలు మరియు చిరు వ్యాపారులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నిరసన కార్యక్రమం చేస్తున్నామని రోడ్డు పక్కన చిన్న చిన్న వ్యాపారాలు నడుపుకునే కుటుంబాలు ఈ ధరల పెంపుతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సిలిండర్ ధర రికార్డు స్థాయిలో పెరగడం వల్ల వ్యాపార నిర్వహణ భారమై, దీనిపై ఆధారపడిన వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ ధరలు పెంపుతో సామాన్య ప్రజలపై భారం పడుతుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా చిన్న వ్యాపారులపై భారం పడకుండా పెంచిన ధరలను తగ్గించాలని ఒకే సారి దాదాపు 1500 రూపాయలు పెంచడం సరికాదని తెలిపారు. ఈ కార్యక్రమంల ఏఐటీయూసీ మండల అధ్యక్షులు బి. వీరేష్, నాయకులు బషీర్, ఖలీల్, రమేష్. నల్లారెడ్డి, హుస్సేన మరియు తెలియజేశారు.

# సంప్రదాయబద్ధంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్

**దేవస్థానంలో సంప్రదాయబద్ధంగా నిర్వహింపబడిన సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్**

**ఉదయం శోభాయమానంగా జరిగిన కలశయాత్ర**

**కలశయాత్రలో పాల్గొన్న సుమారు 1000 మంది భక్తులు**

**శివపంచాక్షరీ నామలేఖన యజ్ఞం**

**ఎల్.ఈ.డి స్క్రీన్‌పై ప్రదర్శించబడిన జాతీయ ప్రసారం**





**ఉత్తేజిత (శ్రీశైలం ప్రతినిధి)**

మే 11వ తేదీన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి శ్రీశైలం దేవస్థానంలో సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించబడింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు,ధర్మకర్తలమండలి ప్రత్యేక ఆహ్వానితులు శ్రీ కారుపర్తి నాగమల్లేశ్వరరావు, శ్రీ ఆకుల శ్రీనివాసులు, అర్చకస్వాములు, వేదపండితులు, పలువురు దేవస్థానం అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. కార్యక్రమములో భాగంగా ఈ ఉదయం ఆలయప్రాంగణములోని అక్కమహాదేవి అలంకారమండపంలో సహస్రకలశరాధన కార్యక్రమం నిర్వహించబడింది. ముందుగా లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. తరువాత సహస్రకలశారాధన కార్యక్రమం జరిగింది. గంగానది పుణ్యనదీజలాలను కలశంలోకి ఆహ్వానిస్తూ కలశారాధన నిర్వహించబడింది. కలశారాధన తరువాత పుణ్యజల కలశాలను భక్తులకు అందజేయబడ్డాయి.

భక్తులందరు కూడా భక్తిశ్రద్ధలతో కలశాలను తలపై ధరించి కలశయాత్రలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం నుంచి గంగాధర మండపం వరకు, అక్కడి నుంచి నందిగుడి వరకు, నందిగుడి నుంచి మల్లికార్జునసదన్ మీదుగా క్షేత్రపాలకుడైన బయలువీరభద్రస్వామి ఆలయం వరకు ఈ కలశయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా బయలువీరభద్రస్వామివారికి విశేషపూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం బయలువీరభద్రస్వామి ఆలయం నుంచి గంగాధర మండపం మీదుగా ఆలయప్రాంగణం వరకు కలశయాత్ర కొనసాగించబడింది. కలశయాత్ర అనంతరం శ్రీవృద్ధమల్లికార్జునస్వామివారికి శాస్త్రోక్తంగా కలశాభిషేకం జరిపించబడింది.ఈ కలశయాత్రలో సుమారు 1000 మంది భక్తులు పాల్గొన్నారు. కలశయాత్రలో పాల్గొన్న భక్తులందరికీ శ్రీస్వామి వారి అలంకార దర్శనం, అమ్మవార్ల దర్శనం కల్పించబడింది.

శివపంచాక్షరీ నామలేఖన యజ్ఞం :

కలశయాత్ర తరువాత శివపంచాక్షరీ నామలేఖన యజ్ఞకార్యక్రమం ప్రారంభించబడింది. ఇందులో భక్తులందరు కూడా శివపంచాక్షరీ నామాన్ని లిఖించేందుకు ( వ్రాసేందుకు) వీలుగా శివపంచాక్షరీ పుస్తకాలను, కలములు ( పెన్నులు) దేవస్థానం భక్తులకు అందజేసింది. అనంతరం భక్తులందరు కూడా శివపంచాక్షరీ మంత్రాన్ని వ్రాయడం జరిగింది. ఈ శివపంచాక్షరి పుస్తకాలను శ్రీస్వామిఅమ్మవార్లకు సమర్పించడం జరుగుతుంది.

ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు : సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ కార్యక్రమంలో భాగంగానే ఈ సాయంకాలం గంగాధర మండపం వద్ద ఏర్పాటు చేయబడిన ప్రత్యేక వేదిక వద్ద పలు ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయబడ్డాయి.

ముందుగా ఈ సాయంత్రం గం. 5.30లకు శ్రీ సత్యంస్వామి మరియు వారి బృందం, వనపర్తి వారిచే శివభజనలు నిర్వహించబడుతాయి. తరువాత గం. 6.30లకు శ్రీ తాతా సందీప్‌శర్మ, రాజమహేంద్రవరం వారిచే ఓంకార ప్రాశస్త్యంపై ప్రవచనం ఏర్పాటు చేయబడింది. అనంతరం రాత్రి గం. 7.30ల నుంచి సుప్రియ బృందం, విజయనగరం వారిచే పేరిణి శివతాండవం ప్రదర్శించబడుతోంది. కాగా ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ సోమనాథ ఆలయంపై దాడి జరిగి 1000 సంవత్సరాలు మరియు ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 సంవత్సరాల సందర్భంగా భారత ప్రభుత్వ సాంస్కృతికశాఖ దేశవ్యాప్తంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరున పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా దేవదాయశాఖ ఉత్తర్వుల మేరకు దేవస్థానం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ ధార్మికచైతన్యానికి, సంప్రదాయ పరిరక్షణకు దేవాలయమే ఆలవాలమన్నారు. అందుకే సమాజానికి దిశానిర్దేశం చేసే వ్యవస్థలో దేవాలయానికి ఎంతో ప్రత్యేకస్థానముందన్నారు. ధర్మం అనేది సమాజాన్ని సక్రమమార్గంలో నడిపిస్తుందన్నారు. ధర్మాచరణ వల్ల పటిష్టమైన సమాజం ఏర్పడుతుందన్నారు.

# గాంధీజీ విగ్రహానికి వెలుగులు.. కళ్ళజోడు అమర్చిన షేక్ అఫ్రోజ్ చొరవ!..



**చీకటి నుంచి వెలుగులోకి గాంధీ విగ్రహం -- టిడిపి శ్రీకాళహస్తి మైనారిటీ అధ్యక్షుడు షేక్ అఫ్రోజ్....**

**రేణిగుంట ఉతేజిత మే 11.**

తిరుపతి జిల్లా రేణిగుంట బస్టాండ్ కూడలి వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం పట్ల టిడిపి శ్రీకాళహస్తి నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు షేక్. అఫ్రోజ్ అభినందనీయమైన సామాజిక స్పృహను చాటుకున్నారు.రేణిగుంట బస్టాండ్ సమీపంలోని గాంధీ మండపములో విద్యుత్ దీపాలు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో జాతిపిత విగ్రహం చీకటిలో ఉండటం, అలాగే విగ్రహానికి ఉండాల్సిన కళ్ళజోడు లేకపోవడాన్ని అఫ్రోజ్ గమనించారు. ఈ పరిస్థితిని చూసి మనస్తాపానికి గురైన ఆయన, తక్షణమే స్పందించి తన సొంత చొరవతో విగ్రహ పునరుద్ధరణ పనులు చేపట్టారు.మండపమునకు నూతనంగా విద్యుత్ దీపాలను (లైట్లు) ఏర్పాటు చేయించి వెలుగులు నింపడమే కాకుండా, గాంధీజీ విగ్రహానికి కొత్త కళ్ళజోడును కూడా అమర్చారు.ఈ సందర్భంగా షేక్ అఫ్రోజ్ మాట్లాడుతూ: "గాంధీ విగ్రహం చీకటిలో ఉండటం, కళ్ళజోడు లేకపోవడం చూసి మనసు బాధపడింది. వెంటనే మండపానికి లైట్లు వేయించి, కళ్ళజోడును అమర్చడం జరిగింది. ఇప్పుడు ఆ మహనీయుని విగ్రహం వెలుగులతో, కళకళలాడుతూ కనిపిస్తుంటే నా మనసుకి ఎంతో తృప్తిగా, సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు.మహనీయుల విగ్రహాలను, స్మారక చిహ్నాలను గౌరవప్రదంగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఆయన గుర్తు చేశారు. షేక్ అఫ్రోజ్ చేసిన ఈ సత్కార్యాన్ని స్థానికులు మరియు ప్రయాణికులు సాదరంగా అభినందిస్తున్నారు.

# తిరుపతిలో ఘనంగా ' ట్రూ జాన్ సోలార్ వినాయక ఎంటర్ప్రైజెస్' ప్రారంభోత్సవం

**ముఖ్య అతిథిగా విచ్చేసి షోరూమ్‌ను ప్రారంభించిన తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి**

**తిరుపతి ఉత్తేజిత మే 11.**



తిరుపతి నగరంలోని బైరాగి పట్టెడలో సోమవారం ఉదయం వినాయక ఎంటర్ప్రైజెస్ ట్రూ జాన్ సోలార్ నూతన షోరూమ్ ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి షోరూమ్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ హితమైన సౌరశక్తి వినియోగం నేటి కాలంలో ఎంతో అవసరమని పేర్కొన్నారు.

విద్యుత్ పొదుపుతో పాటు స్వచ్ఛమైన ఇంధనాన్ని ప్రోత్సహించడంలో ఇటువంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన ఆకాంక్షించారు.వ్యాపార రంగంలో యువత ముందుకు రావడం శుభపరిణామమని, ప్రొప్రైటర్ భరత్ కుమార్ రెడ్డికి ఆయన అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెండి నాగాభరణం సమర్పణ

**ఉత్తేజిత (శ్రీశైలం ప్రతినిధి)**





మే 11వ తేదీన అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన శ్రీ భ్రమరాంబ మల్లి గర్జన స్వాముల వారి శ్రీశైల దేవస్థానంలో శ్రీ యం. దినేష్, మదనపల్లి, అన్నమయ్య జిల్లా వారు అయిదు శిరస్సులతో కూడిన వెండి నాగాభరణాన్ని దేవస్థానమునకు సమర్పించారు. ఈ వెండి నాగాభరణం బరువు 2 కేజీల 610 గ్రాములు.ఆలయ ప్రాంగణములోని ఆశీర్వచన మండపములో దాతలు వీటిని అమ్మవారి ప్రధానార్చకులు విజయస్వామి, వేదపండితులు గంటి రాధకృష్ణశర్మ, అమ్మవారి ఆలయ పర్యవేక్షకులు గంజి రవి, అమ్మవారి ఆలయం ఇన్‌స్పెక్టర్ కె. మల్లికార్జున, గుమాస్తా శ్రీమతి సావిత్రిలకు అందజేశారు. అనంతరం వీరికి తగు రశీదును అందజేసి వేదాశీర్వచనముతో శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేయడం జరిగింది.

# 12న హనుమజ్జయంతి

**ఉత్తేజిత (శ్రీశైలం ప్రతినిధి)**



మే 11 వ తేదీ శ్రీశైలం మహా క్షేత్రంలో వైశాఖ బహుళ దశమిని పురస్కరించుకుని మే 12న పాతాళగంగ మార్గంలోని శ్రీ భక్తాంజనేయ స్వామివారి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవం నిర్వహించబడుతుంది.

మే, 12వ తేదీ ఉదయం 9.00 గంటలకు వేదపండితులు, అర్చక స్వాములు లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ముందుగా జయంత్యోత్సవ సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది.

తరువాత శ్రీ భక్తాంజనేయస్వామిరికి శ్రీమన్యుసూక్త పారాయణ సహిత అభిషేకము, నాగవల్లి దళార్చన, పుష్పార్చన, నీరాజన మంత్రపుష్పములు నిర్వహించబడుతాయి.

# రాత్రిపూట రాగి వైర్ల దొంగతనాలకు పాల్పడుతున్న తమిళనాడు ముఠా అరెస్ట్...

**రేణిగుంట ఉత్తేజిత మే 11**



తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ (నేరాలు) ఆర్ల శ్రీనివాస్ పర్యవేక్షణలో, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో రేణిగుంట రూరల్ సీఐ ఎం. మంజునాథ్ రెడ్డి మరియు గాజులమండ్యం ఎస్సై హరీష తమ సిబ్బందితో కలిసి రాగి వైర్లు దొంగతనం చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేశారు.

?గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రమరెడ్డిపాలెం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కంపెనీలో జరిగిన రాగి వైర్లు, కాపర్ బస్ బార్లు మరియు ఇతర కాపర్ సామగ్రి చోరీ ఘటనపై సీఐ మంజునాథ్ రెడ్డి, ఎస్సై హరీష ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సీసీటీవీ దృశ్యాలు, టోల్ ప్లాజా వివరాలు మరియు సాంకేతిక ఆధారాల సహాయంతో దర్యాప్తు చేపట్టి తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన అనిత, సరసు, హిందు అలియాస్ సింధు, ఇల్లవారాసి అలియాస్ అమ్ము జనిఫా, మణికండన్, ఆనందబాబు అలియాస్ ఆనంద్ అలియాస్ సోట్ట, కుమార్ శబరి అలియాస్ సచిన్ అనే ఏడుగురు నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.ఈ అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు గతంలో దొంగతనం చేసిన సొత్తును అమ్ముకొని, మళ్లీ దొంగతనాలకు పాల్పడేందుకు తిరుపతికి వచ్చినట్లు విచారణలో తేలిందని సీఐ వెల్లడించారు.

# ఈ పేస్టుతో దంతాలు తెల్లగా మారతాయట..



దంతాల ఆరోగ్యాన్ని కాపాడడంలో టూత్‌పేస్ట్ కీ రోల్ పోషిస్తుంది. దీని కోసం కాస్ట్లీ టూత్ పేస్ట్, పౌడర్ వంటివి వాడాల్సిన పనిలేదు. దంతాల సమస్య రాకుండా ఉండేందుకు మళ్ళీ డెంటల్ హాస్పిటల్స్కి వెళ్తాం. దంతాలు స్ట్రాంగ్, హెల్దీగా ఉండాలంటే దానికి కొన్ని టిప్స్ పాటించాలి. ఈ మధ్యకాలంలో వచ్చే టూత్‌పేస్టులు, పౌడర్స్ కెమికల్స్‌తో తయారవుతున్నాయి. వీటి బదులు ఇంట్లోనే మనం నేచురల్‌గా పేస్ట్, పౌడర్స్ తయారు చేయొచ్చు. అదెలానో తెలుసుకోండి.

కావాల్సిన పదార్థాలు.. ఈ పౌడర్ తయారు చేసేందుకు మూడు పదార్థాలు అవసరం. అవి పటిక, లవంగాలు, బేకింగ్ సోడా కావాలి. వీటితో పేస్టుని ఈజీగా తయారు చేయొచ్చు.

తయారీ విధానం.. ముందుగా పాన్ పెట్టి వేడి చేయాలి. ఇందులో పటిక వేసి వేడి చేయాలి. ఇది కరగనివ్వాలి. ఇప్పుడు దీనిని మిక్సీ జార్‌లో వేయాలి. పాన్‌లో ఆరు నుంచి ఎనిమిది లవంగాలు వేసి వేయించాలి. వీటిని గ్రైండర్‌లో వేసి రెండింటినీ మెత్తగా మిక్సీ పట్టాలి. ఇప్పుడు ఈ మిశ్రమంలో రెండు టేబుల్ స్పూన్ల బేకింగ్ సోడా వేసి కలపాలి. దీనిని జార్‌లో స్టోర్ చేసి వాడుకోవచ్చు.

ఈ టూత్‌పేస్టుతో లాభాలు.. ఈ పేస్టుని వాడడం వల్ల క్యావిటీస్ తగ్గుతాయి. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. దీంతో పళ్ళు తోమితే క్యావిటీస్ తగ్గుతాయి. దంతాల చుట్టూ ఉండే చిగుళ్ళు గట్టి పడతాయి.

చిగుళ్ళ రక్తస్రావం.. ఈ టూత్ పౌడర్ వాడితే చిగుళ్ళ నుండి రక్తస్రావం తగ్గుతుంది. ఎందుకంటే ఇందులో వాడే హీలింగ్ గుణాలు, లవంగాలు దంతాలను బలంగా మారుస్తాయి.

దంతాల తెలుపు.. చాలా మందికి దంతాల పసుపు రంగులోకి మారతాయి. మనం తినే ఆహారం కారణంగా పళ్ళు పసుపు రంగులోకి మారతాయి. అలాంటి సమస్యని దూరం చేసేందుకు బేకింగ్ సోడా దంతాలను తెల్లగా మారుస్తాయి. వీటితో పాటు.. ఈ పేస్టుని వాడడం వల్ల మన దంతాల్లో పేరుకుపోయిన సూక్ష్మక్రిములని దూరం చేసి నోటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. బేకింగ్ సోడా నురగని తీసుకొస్తుంది. అందుకే ఈ పేస్టుని వాడొచ్చు. దీని వల్ల దంతాలలో ఉన్న సూక్ష్మ క్రిములు దూరమవుతాయి. ఈ పేస్టులో లవంగాల గుణాలు ఉన్నాయి. కాబట్టి, బ్యాక్టీరియా వల్ల వచ్చే ఇన్ఫెక్షన్‌ని దూరం చేసే యాంటీ సెప్టిక్‌గా పనిచేస్తాయి. ఈ కారణంగానే చాలా బ్రాండెడ్ టూత్‌పేస్టు, మౌత్ వాషెస్‌లో లవంగాలు వాడతారు. మీరు ఎప్పుడు ఫుడ్ తిన్నా ఉదయం, సాయంత్రం రెండు సార్లు పళ్ళు తోమడం అలవాటు చేసుకోండి. దీంతో మీ దంతాలు క్లీన్ అవుతాయి. దంతాలు పసుపు రంగులోకి మారకుండా ఉంటాయి.

# మేకప్ నుంచి మీ చర్మాన్ని రక్షించుకోవడానికి..





మేకప్ అంటే అమ్మాయిలకు ఎంతిష్టమో స్పెషల్‌గా చెప్పనవరం లేదు. పార్టీలు, ఫంక్షన్స్ ఉన్నప్పుడైతే మేకప్ తప్పని సరి. ఇష్టంతోనే కాదు.. కొందరు వృత్తిలో భాగంగానూ రోజూ మేకప్ వేసుకోవలసి ఉంటుంది. రోజూ మేకప్ వేసుకుంటే.. అది చర్మంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మేకప్ ఉత్పత్తుల్లో కెమికల్స్ కారణంగా చర్మం దెబ్బతింటుంది. మేకప్ కారణంగా చర్మం పొడిబారడం, మొటిమలు, వృద్ధాప్య ఛాయలు త్వరగా రావడం వంటి సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. ప్రీ, పోస్ట్ మేకప్ తీసుకుంటే.. మేకప్ నుంచి చర్మాన్ని రక్షించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. చర్మాన్ని మేకప్ నుంచి రక్షించుకోవడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.

సరైన బేస్ ఎంచుకోండి.. మీ రు మేకప్ వేసుకునేముందు, చర్మానికి సరైన బేస్ అప్లై చేయడం చాలా ముఖ్యం. పగటిపూట.. ఫౌండేషన్,క్రీమ్‌ను ధరించే ముందు ప్రైమర్ లాంటి ముగింపుని ఇచ్చే మాయిశ్చరైజర్‌లు, సన్‌స్క్రీన్‌లు అప్లై చేసుకోవడం చాలా ముఖ్యం. సాయంత్రం పూట మేకప్ వేసుకుంటుంటే.. నీటి ఆధారిత మాయిశ్చరైజర్‌లను ఉపయోగించి చర్మాన్ని హైడ్రేట్ చేయడం ముఖ్యం, దాని తర్వాత.. మేకప్ ఎక్కువసేపు ఉండటానికి.. జెల్ ఆధారిత ప్రైమర్‌ను అప్లై చేయండి.

హానికరమైన పదార్థాలకు దూరంగా ఉండండి.. మేకప్ ఉత్పత్తులకు రంగు, సువాసన ఇవ్వడానికి వాటిలో విషపూరితమైన కెమికల్స్ వాడే అవకాశం ఉంది. ఈ కెమికల్స్ మీ చర్మానికి హాని చేస్తాయి. మీ మేకప్ ఉత్పత్తులలో హానికరమైన కెమికల్స్ లేకుండా జాగ్రత్తపడండి. పారాబెన్స్, ఫార్మాల్డిహైడ్, పాదరసం, థాలేట్స్, సీసం, సమ్మేళనాలు ఎండోక్రైన్ వ్యవస్థలు, సంతానోత్పత్తికి అంతరాయం కలిగిస్తాయి. ఈ కెమికల్స్ కారణంగా.. క్యాన్సర్ ముప్పు కూడా పెరుగుతుంది. మీరు సాధ్యమైనంత వరకు సహజ ఉత్పత్తులు వాడటానికి ప్రయత్నించండి. మీ చర్మానికి మాత్రమే కాకుండా మీ ఆరోగ్యానికి కూడా సురక్షితమైన మేకప్‌ను ఎంచుకోవడం చాలా ముఖ్యం.

మేకప్ బ్రష్‌లను శుభ్రం చేయండి.. మేకప్ అప్లై చేయడానికి ఉపయోగించే బ్రష్‌లు, స్పాంజ్‌లు, అప్లికేటర్‌లను శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. మీ మేకప్ బ్రష్‌లను యాంటిసెప్టిక్ లిక్విడ్ సబ్బుతో డీప్ క్లీన్ చేయాలి. బ్యూటీ బ్లెండర్ క్లెన్సర్ ఉపయోగించి స్పాంజ్‌లను శుభ్రం చేసుకోవాలి. స్పాంజ్‌లను బ్యూటీ బ్లెండర్ క్లెన్సర్‌తో శుభ్రం చేసుకోవచ్చు. ఇవి స్పాంజ్‌ల నుంచి కన్సీలర్, ఫౌండేషన్ మరకలను తొలగిస్తుంది. ప్రతిరోజూ మేకప్ వేసుకునే వారు.. వారానికి రెండుసార్లు మేకప్ బ్లష్‌లను శుభ్రం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బ్రష్‌లు, స్పాంజ్‌లను



ఆరబెట్టడానికి హెయిర్‌డ్రైర్‌ను ఉపయోగించవచ్చు.

మేకప్ శుభ్రంగా రిమూవ్ చేయండి.. మేకప్‌ను సరిగ్గా రిమూవ్ చేయకపోతే.. చర్మ సమస్యలు ఎదురవుతాయి. మేకప్ తొలగించుకునే క్రమంలో రిమూవర్ ఉపయోగించినా.. గట్టిగా రుద్దుతూ మరీ శుభ్రం చేసుకుంటారు కొంతమంది. అయితే ఇలా చేయడం వల్ల చర్మం డ్యామేజ్ అయ్యే ప్రమాదమే ఎక్కువ అంటున్నారు నిపుణులు. అందుకే నెమ్మదిగా తొలగించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చర్మానికి జిడ్డుగా అతుక్కుపోయిన మేకప్‌ను ముందుగా కరిగించాల్సి ఉంటుంది. ఇందుకోసం మేకప్‌ను తొలగించే క్లెన్సర్లు బయట దొరుకుతాయి. ఒక కాటన్ ప్యాడ్‌పై ఈ రిమూవర్‌ను వేసి ముఖమంతా అప్లై చేయాలి. కాస్త ఎక్కువగా మేకప్ వేసిన భాగంలో ఈ కాటన్‌ని కొన్ని సెకన్ల పాటు అలాగే ఉంచాలి. ఇలా చేయడం వల్ల మేకప్ కరిగిపోతుంది. అప్పుడు తొలగించడం సులభమవుతుంది. ఆ తర్వాత.. ఒక టీస్పూన్ కొబ్బరినూనెను చేతుల్లోకి తీసుకొని ముఖానికి, మెడకు బాగా పట్టించి 2-3 నిమిషాల తర్వాత కాటన్ ప్యాడ్లతో తుడిచేసుకుంటే సరి. లిప్‌స్టిక్‌ను సైతం కొబ్బరినూనెతో ఇలాగే తొలగించుకోవచ్చు.

తేమనందించండి.. కొన్ని రకాల మేకప్ రిమూవర్స్ చర్మంలోని సహజసిద్ధమైన నూనెల్ని తొలగిస్తాయి. తద్వారా చర్మం పొడిబారిపోతుంది. ఇలాంటప్పుడు మేకప్ తొలగించుకొని, ముఖం శుభ్రం చేసుకున్న తర్వాత చర్మానికి మాయిశ్చరైజర్ అప్లై చేయడం తప్పనిసరి. ఇక పెదాలకు లిప్‌బామ్, కళ్లకు ఐ క్రీమ్.. వంటివీ ఆయా భాగాల్ని తేమగా ఉంచేందుకు తోడ్పడతాయి.













# వండిన తర్వాత మాత్రమే తినాలి..

పచ్చి కూరగాయలు తింటే.. ఆరోగ్యానికి మంచిదా..? ఉడకబెట్టిన కూరగాయలు తింటే.. మంచిదా? అనే ప్రశ్న చాలామందికి ఉంటుంది. చాలామంది పచ్చికూరగాయల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయనే ఉద్దేశంతో.. పచ్చికూరగాయలు తింటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఉంటారు. కొన్ని కూరగాయలు వండితే.. వాటిలోని పోషకాలు తగ్గుతాయి. అయితే, కొన్ని కూరగాయలు ఉడికిస్తే.. అవి ఆరోగ్యంగా మారతాయి. వాస్తవానికి, అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, వండిన ఆహారంతో కూడిన ఆరోగ్యకరమైన డైట్ అనుసరించే వ్యక్తులు పచ్చి ఆహారాన్ని అనుసరించే వారి కంటే ఎక్కువ పోషకాలను గ్రహించారు. కొన్ని ఆహార పదార్థాలు కచ్చితంగా ఉడకబెట్టి తినాలని నిపుణులు అంటున్నారు. పాలకూర.. పాలకూర పోషకాల స్టోర్ హౌస్ అని చెప్పొచ్చు. పాలకూరలో దాదాపు 13 రకాల యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి క్యాన్సర్ ముప్పు నుంచి రక్షిస్తాయి. పాలకూరలో ఆక్సాలిక్ యాసిడ్ కూడా ఉంటుంది, ఇది ఐరన్, కాల్షియం శోషణను అడ్డుకుంటుంది. ఆక్సాలిక్ యాసిడ్ అధిక ఉష్ణోగ్రతల వద్ద విచ్ఛిన్నమవుతుంది, ఇది పోషకాల శోషణను సులభతరం చేస్తుంది. పాలకూర పచ్చిగా తినడం కంటే.. ఉడకబెట్టి తినడమే మంచిది.

చిలగడదుంప.. హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రకారం, చిలగడదుంపలను ఉడకబెట్టడం వల్ల బీటా-కెరోటిన్ స్థాయిలు ఎక్కువవుతాయి. అంతేకాదు, దీనిలోని పోషకాలు శరీరం మరింత సమర్థవంతంగా గ్రహించుకుంటుంది. అందుకే చిలగడదుంపను ఉడకబెట్టి తింటేనే మంచిదని నిపుణులు అంటున్నారు.

పుట్టగొడుగులు.. పుట్టగొడుగులలో ఎర్గోథియోనిన్ అనే యాంటీఆక్సిడెంట్ సమృద్ధిగా ఉంటుంది. ఇది పుట్టగొడుగులు ఉడికించినప్పుడు విడుదల అవుతుంది. ఈ యాంటీఆక్సిడెంట్లు "ఫ్రీ రాడికల్స్" విచ్ఛిన్నం చేయడంలో సహాయపడతాయి, ఆక్సీకరణ ఒత్తిడి నుంచి శరీర కణాలను రక్షిస్తుంది. గ్రీన్ బీన్స్‌లో లెక్టిన్లు ఉంటాయి, ఇది వివిధ జీర్ణ సమస్యలకు దారితీయవచ్చు. వీటిని ఉడికిస్తే.. లెక్టిన్‌లు న్యూట్రల్ అవ్వడమే కాదు.. త్వరగా జీర్ణం అవుతాయి, యాంటీఆక్సిడెంట్ కంటెంట్ మెరుగుపడుతుంది, రుచి కూడా పెరుగుతుంది న్యూట్రిషన్ రీసెర్చ్ జర్నల్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. వంకాయను ఉడికిస్తే.. దానిలో పోషకాలు బైల్ యాసిడ్‌లతో కలిసి బంధించబడతాయి. లివర్ కొలెస్ట్రాల్‌ను మరింత సులభంగా విచ్ఛిన్నం చేస్తుంది.

# బియ్యంపిండిని ఇలా అప్లై చేస్తే ఫేస్ గ్లాసీ స్కిన్‌లా మెరుస్తుంది..



పాలు.. ఇవి ఆరోగ్యానికి మాత్రమే మంచిదని చాలా మంది అనుకుంటారు. అయితే, పాలని వాడడం వల్ల అందం కూడా మెరుగవుతుంది. అందులో ముఖ్యంగా బియ్యపిండి. ఈ రెండింటిని కలిపి రాస్తే ఫేస్ క్లీన్ అయి మంచి గ్లో వస్తుంది. అంతే కాకుండా గ్లాసీ స్కిన్ మీ సొంతమవుతుంది. మరి ఈ రెండింటితో కలిపి ఫేస్ మాస్క్‌ని రెడీ చేసుకోవచ్చు.

బియ్యం పిండి.. కొరియన్ స్కిన్ కేర్‌లో రైస్, రైస్ ఫ్లోర్ చాలా ముఖ్యం. ఈ రైస్ పౌడర్‌ని సరైన విధంగా రాస్తే స్కిన్ మెరుస్తుంది. బియ్యం పిండిలో అమినో యాసిడ్స్ ఉంటాయి. ఇవి చర్మంలో తేమని అలానే ఉంచుతుంది. బియ్యం పిండిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా స్కిన్ ఇన్ఫెక్షన్‌ని దూరం చేస్తుంది. అలాగే ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ చర్మ కణాల డ్యామేజ్‌ని దూరం చేస్తాయి. ఇది ముడతలని తగ్గిస్తుంది.

పాలు.. పాలలో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని మెరుగ్గా చేస్తాయి. పాలు మంచి హైడ్రేటర్. చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచుతాయి. చర్మం పొడిబారినట్లు అనిపిస్తే ముఖానికి పాలు రాయాలి. పాలలో యాంటీ ఆక్సిడెంట్స్ చర్మంపై ముడతలు, వయస్సు తాలుకూ మచ్చల్ని తగ్గిస్తాయి. పాలలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉన్నాయి. ఇది స్కిన్ ఇన్ఫెక్షన్స్‌ని దూరం చేస్తాయి. పాలలోని యాంటీ ఆక్సిడెంట్స్ సూర్యుని నుంచి వచ్చే హానికర యూవీ కిరణాల నుండి చర్మాన్ని కాపాడుకోవచ్చు. మొటిమలు వంటి చర్మ సమస్యల్ని దూరం చేస్తాయి.

మాస్క్ ఎలా చేయాలంటే.. ఈ మాస్క్ ఎలా చేయాలంటే ముందుగా గ్లాసు పాలు తీసుకోండి. ఫ్యాట్ మిల్క్ అయితే మంచిది. ఆ తర్వాత ఓ గిన్నెలో మూడు టీ స్పూన్ల బియ్యపిండి వేసి సరిపడా పాలు వేసి వేడి చేయాలి. ఇది చక్కగా క్రీమ్ అయ్యే వరకూ అలానే ఉంచండి. కలుపుతూనే ఉండాలి. అడుగంట కుండా చూసుకోండి. ఇప్పుడు ముఖాన్ని క్లీన్ చేసి ముఖానికి అప్లై చేయాలి. 15 నిమిషాల తర్వాత క్లీన్ చేయాలి. ఇలా చేయడం వల్ల మచ్చలు తగ్గి చర్మాన్ని గ్లాసీ స్కిన్ ఉండేలా చేస్తుంది. అయితే, మీకు ఏదైనా అలర్జీ ఉంటే ముందుగా స్కిన్ స్పెషలిస్ట్‌ని కలిసి సలహా అడగాలి. అదే విధంగా మీరు ప్యాచ్ టెస్ట్ చేశాకే ఈ ప్యాక్ ట్రై చేయడం మంచిది. మీకు ఓకే అనుకుంటే ప్యాక్ అప్లై చేసి క్లీన్ చేయండి.







# పిల్లల్ని ఇలా చదివిస్తే ఫుల్ మార్కులొస్తాయి..







చాలా మంది పేరెంట్స్ పిల్లలు ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని ఆరాటపడతారు. అందుకోసం పిల్లల్ని ఇంట్లో చదివిస్తారు. ఇంట్లో పిల్లలు బాగా చదివినా పిల్లలకి పరీక్షల్లో ఎక్కువ మార్కులు రావు. దాంతో పిల్లలకి పరీక్షలంటే పెద్దలే ఎక్కువగా భయపడతారు. ఎగ్జామ్స్ డేట్ వచ్చినప్పట్నుంచి ఎగ్జామ్స్, రిజల్ట్స్ టైమ్ వరకూ వారు పడే టెన్షన్ అంత ఇంత కాదు. అలాంటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే కచ్చితంగా పిల్లలు ఎగ్జామ్స్‌లో ఎక్కువ మార్కులు తెచ్చుకుంటారు.

క్రమశిక్షణ.. పిల్లలు మార్కులు తెచ్చుకోవాలంటే బాగా చదివితే సరిపోదు. పిల్లలకి క్రమశిక్షణ ఉండేలా చూసుకోవాలి. అది వారి బ్రెయిన్‌పై కూడా ఎఫెక్ట్ చూపిస్తుంది. దీని వల్ల వారి జ్ఞాపకశక్తిని మెరుగ్గా చేస్తుంది. అదే విధంగా, ప్రతి పనికి ఓ టైమ్పెట్టండి. చదవడానికి ఓ టైమ్, తినడానికి ఓ టైమ్ ఆడుకోవడం, నిద్రపోవడం, ఇలా ప్రతి పనికి ఓ పని పెట్టండి. దీని వల్ల వారు నేర్చుకున్న ప్రతి ఒక్క పనిని కచ్చితంగా గుర్తుపెట్టుకుంటారు.

గోల్.. పిల్లలకి చిన్నతనం నుంచి మంచి లక్ష్యాలు ఉండేలా చూసుకోండి. వారి అభిరుచి ఏంటో తెలుసుకుని వారు ఏమనుకోవాలనుకుంటున్నారో కనుక్కుని అందుకు తగ్గట్లుగా వారు ఎదిగేలా మీరు వారిని ట్రెయిన్ చేయండి. ఆయా రంగాల్లో ఎక్స్‌పర్ట్స్ గురించి చెప్పడం, వారి గోల్స్ రీచ్ అవ్వడానికి ఏమేం చేశారో తెలియజేయాలి. దీని వల్ల వారికి ముందు నుంచే సరైన అవగాహన ఉంటుంది

టైమ్.. టైమ్ కూడా చాలా ముఖ్యం. మనం ఎంత బాగా టైమ్‌ని వాడితే రిజల్ట్ అంత బావుంటుంది. అంతే కానీ, ఎక్కువసేపు చదివితే ఎక్కువగా మార్కులు వస్తాయని అనుకోవద్దు. కచ్చితంగా వారికి మధ్యమధ్యలో బ్రేక్ ఇవ్వాలి. వారికి కొంత సమయం చదవాలి. కొద్దిసేపు బ్రేక్ తీసుకోండని చెప్పండి. ఈ లోపు వారు ఏమేం చదువుకోవాలో ముందుగానే ఓ టైమ్‌ని ప్రిపేర్ చేసుకుంటారు...

మంచి వాతావరణం.. పిల్లలు మంచి ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా చూడండి. వారు చదువుకునేటప్పుడు ఎలాంటి శబ్దాలు, గొడవలు లేకుండా చూడండి. దీంతో వీరు ఏకాగ్రత కోల్పోకుండా చదువుకుంటారు. పిల్లలు చదివేటప్పుడు ఎక్కువ సౌండ్ లేకుండా చూడండి.

షార్ట్ కట్స్.. నేటి కాలంలో ఇంటర్నెట్‌లో షార్ట్‌కట్స్ గురించి చెబుతున్నారు. ఇది ముందుగా మీరు తెలుసుకుని ఈజీగా వారు అర్థమయ్యే విధంగా షార్ట్ కట్స్ ఉపయోగించేలా చూడండి. దీంతో వారు త్వరగా మర్చిపోరు. పరీక్షల్లో కూడా మార్కులు ఎక్కువగా వస్తాయి.

# పెరుగులో కలిపి తింటే బెల్లీ ఫ్యాట్ తగ్గుతుందట..





పెరుగులో ఈ పొడి కలిపి తింటే బెల్లీ ఫ్యాట్, బరువు తగ్గుతుందట..

పెరుగు ఆరోగ్యానికి చాలా మంచిది. రెగ్యులర్‌గా వీటిని తినడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. అయితే, పెరుగు తినడం వల్ల బెల్లీ ఫ్యాట్‌ని కూడా తగ్గించుకోవచ్చు. బరువు కూడా తగ్గుతారు. దానికోసం పెరుగులో జీలకర్ర కలిపి తింటే చాలా మంచి బెనిఫిట్స్ ఉంటాయని చెబుతున్నారు నిపుణులు. అసలు ఇది ఎలా పనిచేస్తుందో చూద్దాం.

పెరుగు, జీలకర్ర.. పెరుగు, జీలకర్రని ప్రతి ఒక్కరూ ఇళ్ళల్లో వాడతారు. ఇవి రెండూ ఆరోగ్యానికి మంచివే. పెరుగులో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. ఈ కొవ్వుని బరువు తగ్గడానికి చాలా మంచిది. జీలకర్రలో జీవక్రియలో బలంగా చేసి ఫ్యాట్‌ని తగ్గిస్తుంది. అందుకే జీలకర్ర నీరు తాగడం మంచిది. పెరుగు, జీలకర్రని కలిపితే అందులోని పోషకాలు రెంట్టింపు అవుతాయి. అందుకే కొద్దిగా పెరుగులో కొద్దిగా జీలకర్ర వేయాలి. దీనిని అలా అయినా వేయొచ్చు. లేదా పొడిలా చేసి వేయాలి. రెండు వేర్వేరు తినడం కంటే రెండింటిని కలిపి తింటే చాలా వరకూ బరువు తగ్గుతారని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అధ్యయనంలో తేలింది. పెరుగులో జీలకర్రని కలిపితే ఫ్యాట్ ముఖ్యంగా చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. కొలెస్ట్రాల్‌ని పెంచే ట్రైగ్లిజరైడ్స్‌ని తగ్గించడంలో కూడా ఇది మంచిది. ఇది డయాబెటిస్‌ని తగ్గిస్తుంది. వీటి కారణంగానే బరువు పెరుగుతారు. కాబట్టి, పెరుగు జీలకర్ర వీటిని తగ్గిస్తాయి.

జీర్ణక్రియ.. ఈ రెండింటిని కలిపి తింటే జీర్ణ సమస్యలకు కూడా దూరమవుతాయి. పెరుగు మంచి బ్యాక్టీరియాని పెంచుతుంది. ఈ రెండూ గ్యాస్ అసిడిటీ సమస్యల నుంచి బయటపడేందుకు హెల్ప్ చేస్తాయి. పెరుగు జీర్ణమవ్వడానికి కొంత సమయం పడుతుంది. అందుకే రాత్రుళ్ళు పెరుగు తినకుండా ఉండడం మంచిదని ఆయుర్వేదం చెబుతుంది. అయితే, ఇందులో జీలకర్ర కలిపి తింటే త్వరగా జీర్ణమవుతుంది. ముఖ్యంగా జీలకర్ర పొడిని కలిపి తింటే మంచిది.





# వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించండి!

వేసవి తాపం రోజురోజుకూ పెరుగుతున్నది. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత మొదలై, మధ్యాహ్నానికి నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. ఇలాంటి సమయంలోనే అనేకమంది వడదెబ్బకు గురవుతున్నారు. ఇది అకస్మాత్తుగా వచ్చేది కాదని, మన శరీరంపై రోజువారీగా పడే వేడి ప్రభావం ఒక స్థాయికి చేరినప్పుడు అది ప్రాణాంతకంగా మారుతుందని వైద్యులు చెబుతున్నారు. అయితే ఈ వడదెబ్బను నివారించడానికి కొన్ని సూచనలు తెలియజేస్తున్నారు.

## సమయపాలన:

ఎండ తీవ్రత ఎకువగా ఉండే ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదు. పనులన్నీ ఉదయాన్నే లేదా సాయంత్రం వేళల్లోనే ముగించుకోవాలి.

## జీర్ణక్రియపై శ్రద్ధ:

వేసవిలో ఒకేసారి భారీగా భోజనం చేయడం ప్రమాదకరం. తకువ పరిమాణంలో ఎకువ సార్లు ఆహారం తీసుకోవాలి. భారీ భోజనం చేస్తే, శరీరం దాన్ని అరిగించడానికి రక్త ప్రసరణను పొట్ట వైపు మళ్లిస్తుంది. దీనివల్ల చర్మం ద్వారా వేడి బయటికి వెళ్లే ప్రక్రియ మందగిస్తుంది.





## చల్లటి నీళ్లు తాగుతున్నారా?

వేసవిలో ఫ్రిజ్‌లోని చల్లటి నీళ్లు తాగడం హాయిగా అనిపించినా, అది ఆరోగ్యానికి మంచిది కాదు. అధిక చల్లదనం వల్ల రక్తనాళాలు కుంచించుకుపోయి, శరీరానికి నీరు అందే ప్రక్రియ ఆలస్యమవుతుంది. గది ఉష్ణోగ్రత వద్ద ఉండే నీరు లేదా కుండ నీళ్లు తాగడం వల్ల శరీరం త్వరగా రీహైడ్రేట్ అవుతుంది. అలాగే ఎండ తీవ్రత 38 డిగ్రీలు దాటినప్పుడు ఫ్యాన్లు కేవలం వేడి గాలినే తిప్పుతాయి, దీనివల్ల శరీరం నుంచి తేమ ఆవిరైపోతుందే తప్ప చల్లదనం లభించదు. చెమట పట్టడం ఆగిపోవడం అనేది వడదెబ్బకు అతిపెద్ద హెచ్చరిక. అలాంటి పరిస్థితి కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి. అధిక బరువు, మధుమేహం, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారిలో శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ బలహీనంగా ఉంటుంది. అలాగే బీపీ మందులు వాడేవారు కూడా వేడికి త్వరగా ప్రభావితమవుతారు. వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు, ఎండలో పని చేసే కూలీలు వేసవిలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి.







# ఉత్కంఠ పోరులో ఆర్సీబీ విజయం

## ముంబయి ఇంటికి
## 8వ ఓటమితో ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమణ



**రాయ్‌పుర్:** ఐపీఎల్-19లో బెంగళూరు బలంగా పుంజుకుంది. ఆదివారం ఆఖరి బంతికి ఫలితం తేలిన మ్యాచ్‌లో ఆ జట్టు 2 వికెట్ల తేడాతో ముంబయిని ఓడించింది. మొదట ముంబయి.. భువనేశ్వర్ కుమార్ (4/23) ధాటికి 20 ఓవర్లలో 7 వికెట్లకు 166 పరుగులే చేసింది. తిలక్ (57; 42 బంతుల్లో 3x4, 2x6), నమన్ (47; 32 బంతుల్లో 5x4, 2x6) రాణించారు. ఛేదనలో కృనాల్ (73; 46 బంతుల్లో 4x4, 5x6) మెరుపులతో బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. బోష్ (4/26), దీపక్ చాహర్ (2/33) విజృంభించినా.. ముంబయిని గెలిపించలేకపోయారు. కెప్టెన్ హార్దిక్ పాండ్య గాయం నుంచి కోలుకోకపోవడంతో ఈ మ్యాచ్‌లోనూ ముంబయిని సూర్యకుమారే నడిపించాడు. ఛేదనలో బెంగళూరు కూడా తడబడింది. తొలి ఓవర్లోనే ఆ జట్టుకు పెద్ద షాక్ తగిలింది. గత మ్యాచ్‌లో లఖ్‌నవూపై డకౌట్ అయిన స్టార్ బ్యాటర్ కోహ్లి.. మరోసారి సున్నాకే వెనుదిరిగాడు. దీపక్ చాహర్ బౌలింగ్‌లో కోహ్లి షాట్ ఆడగా.. మిడాఫ్‌లో రాజ్ బవా డైవింగ్ క్యాచ్ పట్టేశాడు. తర్వాత పడిక్కల్ (12)ను పెవిలియన్ చేర్చి ఆర్సీబీని దీపక్ చాహర్ మరో దెబ్బ కొట్టాడు. కెప్టెన్ పాటీదార్ (8) సైతం నిలవకపోవడంతో బెంగళూరు 5.1 ఓవర్లకు 39/3తో ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో బెతెల్, కృనాల్ జట్టును ఆదుకున్నారు. దూకుడుగా ఆడకపోయినా.. ఒకటి రెండు పరుగులు తీస్తూ స్కోరు పెంచారు. కుదురుకున్నాక కృనాల్ షాట్లకు దిగడంతో ఆర్సీబీ 10 ఓవర్లకు 74/3తో లక్ష్యం దిశగా సాగింది. కీలక సమయంలో బెతెల్ (27) ఔట్ కావడం, సాధించాల్సిన రన్‌రేట్ పెరగడంతో ఆర్సీబీ ఒత్తిడిలో పడింది. కానీ పట్టువదలకుండా ఆడిన కృనాల్.. జితేశ్‌తో కలిసి బెంగళూరును విజయపథంలో నడిపించాడు. ఈ క్రమంలోనే అతడు 32 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. ఒకవైపు కాలు పట్టేసినా కృనాల్ తగ్గలేదు. మెరుపు షాట్లతో ఆర్సీబీని విజయానికి చేరువ చేశాడు. కానీ అతడు కీలక సమయంలో ఔట్ కావడంతో ఉత్కంఠ నెలకొంది. రాజ్ బవా వేసిన చివరి ఓవర్లో ఆర్సీబీ 15 పరుగులు చేయాల్సి వచ్చింది. తొలి మూడు బంతుల్లో (1 నోబాల్, 2 వైడ్లు సహా) 5 పరుగులు చేసిన ఆర్సీబీ.. రొమారియో షెపర్డ్ (4; 11 బంతుల్లో) వికెట్ కోల్పోయింది. 3 బంతుల్లో 10 పరుగులు అవసరమైన స్థితిలో.. నాలుగో బంతికి భువనేశ్వర్ (7 నాటౌట్) సిక్స్ బాదడంతో సమీకరణం 2 బంతుల్లో 4 పరుగులుగా మారింది. అయిదో బంతికి భువి సింగిల్ తీయగా.. చివరి బంతికి రసిఖ్ (3 నాటౌట్) రెండు పరుగులు రాబట్టడంతో ఆర్సీబీ ఉత్కంఠభరిత విజయాన్ని అందుకుంది.

### భువనేశ్వర్ ధాటికి..:

అంతకుముందు భువనేశ్వర్ విజృంభించడంతో ముంబయి ఒక మోస్తరు స్కోరుకే పరిమితమైంది. ఆ జట్టు ఇన్నింగ్స్ ఆరంభమైన తీరే పేలవం. ఈ సీజన్లో గొప్ప ఫామ్‌లో ఉన్న భువి దెబ్బకు ముంబయి దారుణంగా తడబడింది. తొలి ఓవర్లోనే రికెల్టన్ (2)ను ఔట్ చేసిన ఈ పేసర్.. ఇన్నింగ్స్ మూడో ఓవర్లో ముంబయికి డబుల్ షాక్ ఇచ్చాడు. జోరు మీద కనిపించిన రోహిత్ (22; 10 బంతుల్లో 2x4, 2x6)ను భువి నకుల్ బంతితో బుట్టలో వేశాడు. వైఫల్యాలను కొనసాగిస్తూ సూర్యకుమార్ (0) తొలి బంతికే పెవిలియన్ చేరాడు. 3 ఓవర్లకు 28/3తో ముంబయి కష్టాల్లో పడిపోయింది. ఈ స్థితిలో నమన్ ధీర్, తిలక్ వర్మ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. దీంతో 10 ఓవర్లకు 88/3తో ముంబయి కోలుకుంది. కానీ రెండు ఓవర్ల వ్యవధిలో నమన్ ధీర్, జాక్స్ (10) ఔటైపోవడం, అర్ధసెంచరీ తర్వాత తిలక్ కూడా భువి బౌలింగ్‌లో వెనుదిరగడంతో ఆ జట్టు 170లోపు స్కోరుకే పరిమితమైంది.



# లఖ్‌నవూపై చెన్నై విజయం

## ఉర్విల్ పటేల్ విధ్వంసం..
## ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన లఖ్‌నవూ



**చెన్నై:** చెన్నై సూపర్‌కింగ్స్ అదరగొట్టింది. ఉర్విల్ పటేల్ (65; 23 బంతుల్లో 2x4, 8x6) నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడడంతో ఆదివారం ఆ జట్టు 5 వికెట్ల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను మట్టికరిపించింది. జోస్ ఇంగ్లిష్ (85; 33 బంతుల్లో 10x4, 6x6) చెలరేగడంతో మొదట లఖ్‌నవూ 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. షాబాజ్ అహ్మద్ (43 నాటౌట్; 25 బంతుల్లో 3x4, 3x6) కూడా రాణించాడు. చెన్నై బౌలర్లలో ఒవర్టన్ (3/36), నూర్ అహ్మద్ (1/24) ఆకట్టుకున్నారు. ఉర్విల్‌తో పాటు రుతురాజ్ (42; 28 బంతుల్లో 3x4, 2x6) సత్తా చాటడంతో లక్ష్యాన్ని సీఎస్కే 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 2019 తర్వాత ఐపీఎల్‌లో 180o లక్ష్యాన్ని చెన్నై ఛేదించడం ఇదే తొలిసారి కావడం విశేషం. చెన్నై విజయాన్నందుకుందంటే ప్రధాన కారణం ఉర్విల్ పటేల్ విధ్వంసమే. గెలుపు ముంగిట తడబడ్డ సీఎస్కే.. ఆరంభంలో ఉర్విల్ ధనాధన్ ఇన్నింగ్స్ కారణంగా సాధించాల్సిన రన్‌రేట్ అందబాటులో ఉండడంతో గట్టెక్కింది. ఛేదనలో శాంసన్ (28; 14 బంతుల్లో 3x4, 2x6) చెలరేగడంతో 4వ ఓవర్లో 45/0తో బలంగా నిలిచింది చెన్నై. శాంసన్‌ను దిగ్వేశ్ ఔట్ చేసినా.. లఖ్‌నవూకు ఎలాంటి ఉపశమనం దక్కలేదు సరికదా.. ఆ జట్టు పరిస్థితి దయనీయంగా మారింది. శాంసన్ స్థానంలో వచ్చిన ఉర్విల్ భీకరంగా విరుచుకుపడ్డాడు. పిడుగుల్లాంటి షాట్లతో సిక్సుల మోత మోగించిన అతడు.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ప్రత్యర్థి బౌలింగ్‌ను ఊచకోత కోశాడు. అవేష్ ఓవర్లో వరుసగా మూడు సిక్స్‌లు దంచిన అతడు.. దిగ్వేశ్ ఓవర్లో మూడు సిక్స్‌లు, ఫోర్ బాదేశాడు. షమి బౌలింగ్‌లోనూ ఓ సిక్స్ కొట్టిన ఉర్విల్.. ఓ సింగిల్‌తో అర్ధశతకం పూర్తి చేశాడు. పదో ఓవర్లో ఉర్విల్ నిష్క్రమించేటప్పటికి స్కోరు 125. చెన్నై విజయం చాలా తేలికే అనుకున్నారంతా. కానీ ఆ జట్టు అనూహ్యంగా ఒత్తిడికి గురైంది. ఓపెనర్ రుతురాజ్ ధాటిగా ఆడలేకపోయాడు. కార్తీక్ శర్మ కూడా అంతే. పరుగులు చేయడానికి చెమటోడ్చాడు. హఠాత్తుగా బౌండరీల రాక ఆగిపోయింది. 15 ఓవర్లు ముగిసే సరికి రుతురాజ్ వికెట్‌ను కోల్పోయిన సీఎస్కే 165/3తో నిలిచింది. పరుగుల రాకపోవడంతో అసహనానికి గురైన బ్రెవిస్.. తర్వాతి ఓవర్లో బౌల్డయ్యాడు. కార్తీక్ శర్మ కూడా ఔట్ కావడంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. పరుగుల రాక కష్టమైన వేళ, చివరి మూడు ఓవర్లలో 30 పరుగులు చేయాల్సిన స్థితిలో సీఎస్కేపై ఒత్తిడి పెరిగింది. లఖ్‌నవూకు ఆశలు రేగాయి. అయితే ప్రశాంత్ వీర్.. 18, 19వ ఓవర్లలో ఒక్కో సిక్స్ కొట్టడంతో చెన్నై పని తేలికైంది. ఆఖరి ఓవర్లో ఆ జట్టు 10 పరుగులు చేయాల్సిన స్థితిలో స్పిన్నర్ మార్‌క్రమ్ రెండు వైడ్లతో మొదలు పెట్టాడు. ఆ తర్వాత దూబె వరుసగా రెండు సిక్స్‌లతో సీఎస్కేను గెలిపించాడు.

### మెరిసిన ఇంగ్లిస్:

ఇంగ్లిస్ విధ్వంసంతో మొదట లఖ్‌నవూ మెరుగైన లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. అయితే ఘనంగా ఆరంభించిన ఆ జట్టు.. ఇంకా పెద్ద స్కోరే చేయాల్సింది. కానీ చెన్నై బంతితో పుంజుకుని లఖ్‌నవూను కట్టడి చేయగలిగింది. ముఖ్యంగా ఒవర్టన్, నూర్ అహ్మద్ సూపర్‌గా బౌలింగ్ చేశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ.. ఇంగ్లిస్ విధ్వంసంతో 5 ఓవర్లలో 77/0తో తిరుగులేని స్థితిలో నిలిచింది. హొసీన్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లో వరుసగా 6, 4, 6 బాదిన ఇంగ్లిస్... అదే జోరును కొనసాగించాడు. కాంబోజ్ ఓవర్లో రెండు సిక్స్‌లు, ముకేశ్ ఓవర్లో రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లతో చెలరేగిపోయాడు. హొసీన్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6, 4 దంచేశాడు. ఇంగ్లిస్ కేవలం 17 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. ఆరో ఓవర్ నుంచి ఆట స్వరూపమే మారిపోయింది. మార్ష్‌ను ఔట్ చేయడం ద్వారా ఎల్ఎస్‌జీ పతనాన్ని ఆరంభించిన సీఎస్కే.. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టి పరుగుల వేగానికి కళ్లెం వేసింది. పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ పూరన్ (1) ఇలా వచ్చి అలా వెళ్లగా.. పదో ఓవర్లో ఇంగ్లిస్, పంత్ (15)ను ఔట్ చేయడం ద్వారా లఖ్‌నవూను ఒవర్టన్ గట్టి దెబ్బతీశాడు. మార్‌క్రమ్ (6) రనౌటయ్యాడు. అక్షత్ రఘువంశీ (18) నిలబడ్డా.. వేగంగా పరుగులు చేయలేకపోయాడు. 7-16 మధ్య 10 ఓవర్లలో లఖ్‌నవూ.. 5 వికెట్లు కోల్పోయి 68 పరుగులు మాత్రమే చేయగలిగింది. అయితే షాబాజ్ బ్యాట్ ఝుళిపించడంతో ఆఖరి నాలుగు ఓవర్లలో ఎల్ఎస్‌జీ 44 పరుగులు రాబట్టింది.



## కొంచెం భయంగా ఉన్నా..
# ఎగ్జైటింగ్‌గా ఉంది

బాలీవుడ్ గ్లామర్ బ్యూటీ దిశా పటానీ, ఇప్పుడు గ్లోబల్ స్టేజ్ మీద తన సత్తా చాటడానికి సిద్ధమైపోయింది. ఆమె నటిస్తున్న మొదటి హాలీవుడ్ చిత్రం 'ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్' ట్రైలర్ తాజాగా విడుదలై సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమాలో దిశా తన మునుపెన్నడూ చూడని అత్యంత పవర్‌ఫుల్, యాక్షన్ అవతారంలో కనిపిస్తోంది. ఈ అంతర్జాతీయ ప్రాజెక్ట్‌లో దిశా పటానీ 'జెసికా' అనే కీలక పాత్రను పోషిస్తోందట. ఇందులో దిశా తన విశ్వరూపం చూపించబోతోంది. ఇక తన హాలీవుడ్ ఎంట్రీ గురించి దిశా మాట్లాడుతూ.. "ఈ అంతర్జాతీయ ప్రాజెక్ట్ కోసం నేను ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నాను. మొదటి హాలీవుడ్ సినిమా అంటే కొంచెం భయంగా ఉన్నా, ఎంతో ఎగ్జైటింగ్‌గా ఉంది. ఇంత పెద్ద నటీనటులతో కలిసి పని చేయడం నాకు ఒక గొప్ప పాఠంలా అనిపించింది. కథలు చెప్పడానికి భాష లేదా భౌగోళిక సరిహద్దులు అడ్డంకి కావని నేను అర్థం చేసుకున్నాను. మన దేశంలో నేర్చుకున్న యాక్షన్ విద్యను గ్లోబల్ ప్లాట్‌ఫామ్ మీద చూపించడం నాకు ఎంతో గర్వంగా ఉంది" అని సంతోషం వ్యక్తం చేశారు.



# వైట్ శారీలో రాశి సింగ్

మోస్ట్ బ్యూటిఫుల్ నటి రాశి సింగ్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె సినిమాల కంటే సోషల్ మీడియా ద్వారానే ఎక్కువగా పాపులారిటీ సంపాదించుకుంది. ఎప్పటికప్పుడు తన గ్లామరస్ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆమె పోస్ట్ చేసే ఫోటోలు అనేకసార్లు వైరల్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. తాజాగా మరోసారి రాశి సింగ్ తన స్టైలిష్ లుక్‌తో నెట్టింట హల్‌చల్ చేస్తోంది. తెలుపు రంగు పలుచటి శారీలో అందంగా మెరిసిపోయిన ఈ బ్యూటీ, దానికి తగిన బ్లౌజ్‌ను ధరించి ఫోటోలకు స్టిల్స్ ఇచ్చింది. అలాగే తన కురులను ముందుకు వదిలేసి, ట్రెండీ ఇయర్ రింగ్స్ ధరించడం ద్వారా మరింత ఆకర్షణీయంగా కనిపించింది. మెత్తంగా వైట్ శారీలో రాశి సింగ్ ఫ్రంట్ అండ్ బ్యాక్ అందాలు ప్రత్యేకంగా హైలైట్ కావడంతో ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో సూపర్ వైరల్ అవుతున్నాయి.



# నా అవుట్‌ఫిట్ గురించి ఎగ్జైటెడ్‌గా ఉన్నా

యంగ్ హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్ తన కెరీర్‌లో మరో అద్భుతమైన మైలురాయిని చేరుకోబోతున్నారు. మే 14న ప్రతిష్టాత్మకమైన కాన్స్ ఫిలిం ఫెస్టివల్ వేదికపై ఆమె మొదటిసారి సందడి చేయనున్నారు. ఇటీవల విడుదలైన ఆమె చిత్రం 'లోకా - చాప్టర్ 1 - చంద్ర' ఘన విజయం సాధించిన నేపథ్యంలో, ఈ అంతర్జాతీయ ఆహ్వానం అందడం పట్ల ఆమె ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. "సినిమా ప్రపంచంలో కాన్స్ ఫెస్టివల్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి వేదికపై అడుగుపెట్టడం నాకు చాలా గర్వంగా అనిపిస్తోంది. ముఖ్యంగా 'లోకా' సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే, నా కాన్స్ అరంగేట్రం నాకు మరింత స్పెషల్‌గా అనిపిస్తోంది" అని కళ్యాణి తన ఎగ్జైట్‌మెంట్‌ను పంచుకున్నారు. ప్రస్తుత కాలంలో భారతీయ సినిమాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్న తీరుపై కళ్యాణి హర్షం వ్యక్తం చేశారు. "మన కథలు, మన గొంతుకలు ఇప్పుడు గ్లోబల్ స్థాయిలో వినిపిస్తున్నాయి. ఈ గొప్ప మార్పులో నేను కూడా ఒక భాగం కావడం, నా కెరీర్ ఈ దశలో ఉండగా కాన్స్ వంటి వేదికను అనుభవించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను" అని ఆమె పేర్కొన్నారు. ఈ వేడుకను ఎటువంటి ఒత్తిడి లేకుండా, ఎంతో హాయిగా ఆస్వాదించాలని తాను అనుకుంటున్నట్లు ఆమె తెలిపారు. రెడ్ కార్పెట్ మీద కళ్యాణి ఎలా కనిపిస్తారనే దానిపై ఇప్పటికే సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దీనిపై ఆమె స్పందిస్తూ.. "నా అవుట్‌ఫిట్ గురించి నేను కూడా చాలా ఎగ్జైటెడ్‌గా ఉన్నాను. కొన్ని విషయాలు ఇంకా ప్లాన్ చేస్తున్నాం, కానీ కచ్చితంగా అందరినీ ఆకట్టుకునేలా నా లుక్ ఉంటుంది. ఇది నా కెరీర్‌లోనే మరుపురాని క్షణం" అని చెప్పారు. 'లోకా -- చాప్టర్ 1 -- చంద్ర' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన కళ్యాణి, ఇప్పుడు కాన్స్ వేదికపై తన మెరుపులు మెరిపించడానికి సిద్ధమవుతున్నారు.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek
her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At
Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.